క్లుప్తంగా

అడవుల సంరక్షణపై అవగాహన



కొత్తపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో అడవుల సంరక్షణపై అటవీ శాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ఫారెస్ట్ బీట్ అధికారి రామారావు మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా కృషి చేయాలన్నారు. అడవుల సమీపంలో నిప్పును ఉపయోగించరాదన్నారు. అడవుల్లో ఉన్న వనరులను సొంతానికి వినియోగిస్తే అటవీ శాఖ చట్టం ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విజయనగరం అర్బన్: విద్యార్థి దశ నుంచి మానసిక ఉల్లాసానికి క్రీడలు కీలకంగా నిలుస్తాయని టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోరాడ రామారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్ శ్రీచైతన్య కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన పాఠశాల క్రీడా వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిత విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ గౌరవవందన స్వీకరించారు. అనంతరం ఈ సందర్భంగా చేపట్టిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు, పాఠశాల డీన్స్ సత్యనారాయణ, సాయికిషోర్, సూర్యచంద్ర, అప్పలనాయుడు, జోనల్ పీఈటీ పి.వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

విజయనగరం: 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయనగరం కార్పొరేషన్ పరిధిలో మార్కెట్ ఆశీలు వసూళ్లకు నిర్వహించిన బహిరంగ వేలం పాట వాయిదా వేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.తిరుమలరావు తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన వేలం పాటలో పాటదారులు ఎవ్వరూ పాల్గొనని నేపథ్యంలో వాయిదా వేసినట్టు తెలిపారు. వేలం పాట మళ్లీ నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

విధుల్లో చేరిన న్యూరోసర్జన్, న్యూరో ఫిజిషియన్లు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్లు విధుల్లో చేరారు. ఈ మేరకు వారు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. జనరల్ సర్జన్‌గా డాక్టర్ రెడ్డి శంకరరావు (అసిస్టెంట్ ప్రొఫెసర్), న్యూరో ఫిజిషియన్లుగా డాక్టర్ ఎస్.వెంకటేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), కల్లూరి చిన్నారావు (అసిస్టెంట్ ప్రొఫెసర్) విధుల్లో చేరారు.

పశువైద్య శిబిరం



తాటిపాడులో పశువులకు టీకాలు

రేగిడి: మండలంలోని తాటిపాడు గ్రామంలో రాజాం జీఎంఆర్ఐటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఎస్.దుర్గాప్రసాద్, సిబ్బంది కలిసి 15 ఆవులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు, 45 ఆవులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సీజన్ మారుతున్న కొద్దీ కొత్త కొత్త వ్యాధులకు పశువులు గురయ్యే అవకాశం ఉన్నందున పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రసాద్, సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బుర్రకథ కళాకారులు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. బుర్రకథ రూపంలో కళాకారులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో పి.రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా మనమంతా కృషి చేయాలని, చిన్నతనంలోనే వివాహాలు చేసుకోవడం ద్వారా మాతృ, శిశు మరణాలు జరిగే అవకాశం ఉందన్నారు.

టెస్ట్ పేపర్లు అందజేత

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను మంగళవారం వితరణ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, స్పందన సంస్థ ప్రతినిధి కాజా గోపాలరావు సహకారంతో 50 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, హెచ్ఎం విశాలాక్షి, సర్పంచ్ పువ్వల మాధవరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరు మారింది

ఊరు మారింది



చెల్లూరు గ్రామంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



చెల్లూరు బీసీ కాలనీ వద్ద నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం

- రూ.69.24 లక్షలతో భవన నిర్మాణాలు
- రూ.8.17 కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలు
- రూ.11 లక్షలతో కాలువలు, ప్రహరీల నిర్మాణం
- నాడు – నేడు కింద రూ.32.64 లక్షలతో పాఠశాలల అభివృద్ధి
- సచివాలయం పరిధిలో ఉన్న గృహాలు 976
- సచివాలయం పరిధిలో ఉన్న జనాభా 3270
- 25 సంక్షేమ పథకాలకు, 8 పరోక్ష ప్రయోజనం కింద లబ్ధి పొందిన వారు 6757 మంది
- సంక్షేమ పథకాలకు మంజూరు చేసిన మొత్తం రూ.15.22 కోట్లు
- పరోక్ష ప్రయోజనం కింద రూ.3.47 కోట్లు



రూ. 25 లక్షలతో నిర్మించిన చెల్లూరు గ్రామ సచివాలయం

విజయనగరం రూరల్: 'గ్రామ స్వరాజ్యానికి సరికొత్త నిర్వచనం చెప్పింది... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన.' నాలుగున్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. అభివృద్ధికి సరికొత్త నిర్వచనం చెబుతూ గ్రామాల్లో సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమ పథకాల అమలుతో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఆయా వ్యవస్థలు కొంత పుంతలు తొక్కుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఎన్నికల హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావు లేకుండా, రాజకీయాలకు, సిఫార్సులకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదే. విజయనగరం మండలం చెల్లూరు (చెలువూరు) సచివాలయం పరిధిలోని చెల్లూరు, బడుకొండపేట, రామజోగిపేట గ్రామాలు అభివృద్ధి, సంక్షేమంలో ముందుండటంతో ఆయా గ్రామాల ప్రజలు జననేత జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. గ్రామ సచివాలయం పరిధిలో 3270 మంది ప్రజలు ఉండగా, ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారుల సంఖ్య 6757 మంది (కొంత మంది లబ్ధిదారులకు రెండు, మూడు పథకాలు అందుతున్నాయి). నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలకు రూ.18.69 కోట్లను నేరుగా లబ్ధిదారులకు అందించగా, అభివృద్ధికి రూ.9.28 కోట్ల నిధులను మంజూరు చేశారు.

రూ.69.24 లక్షలతో భవన నిర్మాణాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఒకే గ్రామ పంచాయతీగా ఉన్న చెల్లూరు, రామజోగిపేట, బడ్డుకొండపేట గ్రామాలు, గ్రామ ప్రజల కోరిక మేరకు చెల్లూరు, బడ్డుకొండపేట గ్రామ పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. గ్రామ సచివాలయానికి అదనపు భవనాన్ని రూ.25 లక్షలతో మంజూరు చేసి పూర్తి చేశారు. రైతుల ప్రయోజనాలకు రూ.23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మించగా, 24 గంటలు ఇంటింటికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు.

తీరిన బీటీ రోడ్డు నిర్మాణం కల

బడుకొండపేట గ్రామానికి ఉన్న బీటీ రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో విజయనగరం ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషితో రూ.8 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.17 లక్షలు, కాలువల నిర్మాణాన్ని రూ.11 లక్షలతో పూర్తి చేశారు.

పేదల సంక్షేమానికి రూ.18.69 కోట్లు

చెల్లూరు గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న మూడు గ్రామాల ప్రజల సంక్షేమానికి రూ.18.67 కోట్ల నిధులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవినీతికి, సిఫార్సులకు తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు అందించింది. వైఎస్సార్ పింఛను కానుకకు రూ.5.29 కోట్లు అందించగా, వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.2.37 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకానికి రూ.1.40 కోట్లు, జగనన్న అమ్మ ఒడి పథకానికి రూ.1.88 కోట్లు, వైఎస్సార్ ఆసరా రూ.1.49 కోట్లు, ఇతర పథకాలకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. చెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి రూ.22.23 లక్షలను, బడ్డుకొండపేట ప్రాథమిక పాఠశాలకు రూ.10.41 లక్షలను నాడు – నేడు పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.



చెల్లూరు ఎంపీయూపీ పాఠశాల

జగనన్నే అండ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రతీ నెలా ఒకటో తారీఖునే పింఛను అందుతుంది. ప్రతీ ఏడాది చేయూత పథకం కింద రూ.18,750లు వస్తుంది. దీంతో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నాను. ఆసరా కింద మరో రూ.4 వేలు ఏటా వస్తుంది. భర్త చనిపోయి 10 ఏళ్లు అయింది. ఉన్న ఒక్క కూతురికి పెళ్లి చేసి అత్తవారింటికి పంపించాను. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతోనే జీవనం కొనసాగిస్తున్నాను. సీఎం జగన్ అండతోనే ఒంటరిదానినన్న బాధపోయింది.

– పొంద్రంకి అప్పలపైడితల్లి, లబ్ధిదారు, చెల్లూరు గ్రామం

కుటుంబ సభ్యులపై భారం తగ్గింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక కొడుకులా మా బాగోగులు పట్టించుకోవడం ఆనందంగా ఉంది. గ్రామ వలంటీరు ప్రతీ నెలా ఒకటో తారీఖున ఉదయం 5.30 గంటలకే ఇంటికి వచ్చి పింఛను అందిస్తున్నారు. మా ఆరోగ్యం కోసం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించడం మరింత ఆనందంగా ఉంది. ఇదంతా కొడుకులా చూసుకుంటున్న వైఎస్ జగన్ చలవే.

– బోడసింగి పైడితల్లి, వృద్ధాప్య పింఛను లబ్ధిదారుడు, చెల్లూరు గ్రామం



బడ్డుకొండపేటకు నిర్మించిన బీటీ రోడ్డు



చెల్లూరులో నిర్మించిన సీసీ రోడ్డు



బీసీ కాలనీలో నిర్మించిన మురుగునీటి కాలువ

నేడు పైడితల్లి అమ్మవారి విగ్రహ పతిష్ఠ



పైడితల్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో కొలువైన పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని రూ.40 లక్షలు దేవదాయ శాఖ నిధులతో పాటు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విరాళంగా అందజేసిన రూ.10 లక్షలు మొత్తం కలిపి రూ.50 లక్షల నిధులతో పునర్నిర్మించిన ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ పతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మంగళవారం సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు మల్లిబాబు అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కర్రోతు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రభుత్వ వైద్య సేవలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



చినబూరాడపేటలో వైద్యురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

నెల్లిమర్ల రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ఇంటింటా ప్రజలకు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని చిన బూరాడపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యాన్ని పేద ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎంతో మంది రోగులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడితో కలిసి రోగులకు ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడుతూరి రామారావు, నాయకులు బెల్లాన రామారావు, మక్కువ వెంకటరమణ, శంకర్రావు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

16న రవాణా రంగ కార్మికుల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

విజయనగరం ఫూల్‌బాగ్: రవాణా రంగ కార్మికుల పాలిట శాపంగా మారిన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరగనున్న సమ్మెలో రవాణా రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఈ నెల 16న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె విజయవంతానికి ఫిబ్రవరి 14న కరపత్ర ప్రచారం, సంతకాల సేకరణ, 15న కోట నుంచి కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ, 16న ఉదయం 9 గంటలకు అన్ని ఆటో, లారీ, క్యాబ్, కారు, లగేజ్ గూడ్స్ వెహికల్స్, ఆర్టీసీ, హెయిర్ బస్, ట్రావెల్స్ స్టాండ్‌ల నుంచి డ్రైవర్లు, వర్కర్లు యూనిఫామ్‌తో హాజరు కావాలని, టు వీలర్, త్రీ వీలర్ వాహనాలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో డ్రైవర్ల అందరూ పాల్గొని మన శక్తిని, ఐక్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని కోరారు. జిల్లా కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్టీసీ స్టాఫ్ – వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, లగేజీ గూడ్స్ వెహికల్స్ నాయకులు సూరిబాబు, సత్తిబాబు, వెంకటరమణ, ఆటో యూనియన్ నాయకులు పాపారావు, మూర్తి, పైడిరాజు లక్ష్మణ్ దొర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, అధ్యక్షుడు. పి.శంకర్రావు, నాయకులు టీవీ రమణ, వి.లక్ష్మి, యూఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిత కళాశాల ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం భారతీయ సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఆమె పోషించిన పాత్ర కీలకమని అన్నారు. మహిళలందరూ సరోజినీ నాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మీరంతా వృద్ధిలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీఏ నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

విజయనగరం అర్బన్: గిరిజన గురుకుల కళాశాల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని గిరిజన గురుకుల అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వ చర్యలు తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని మంగళవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు అందజేశారు. గిరిజన గురుకులాల సిబ్బంది పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌ని కలిసిన వారిలో రాష్ట్ర గిరిజన గురుకుల అధ్యాపకుల సంఘం నాయకులు టి.శ్రీనివాసు, వీఏ ఉమామహేశ్వరరావు, ఎస్‌వీ అప్పలనాయుడు, పీఏ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

సత్తాచాటిన సెంచూరియన్ విద్యార్థులు



శ్రీనివాస పండా



తనీష్ పాత్రో



రాహుల్ గాడో



అట్టాల జాహ్నవి



సమాంతర్ మైత్రా

పర్లాకిమిడి: జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్–2024 మెయిన్స్ ఫలితాల్లో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి తెలియజేశారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ప్లస్ టూ విద్యార్థులు శ్రీనివాస పండా 96.4 శాతం సాధించగా, తనీషా పాత్రో 92.5 శాతం, రాహుల్ గాడో 92.2 శాతం, సమాంతర్ మైత్రా 87.5 శాతం, అట్టాల జాహ్నవి 85.4 శాతం, కె.రాజేంద్ర 78.9 శాతం సాధించారు. వీరిలో శ్రీనివాస పండా సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ అధ్యాపకుడు రబినారాయణ పండా కుమారుడు. విద్యార్థులకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి, ప్రాంతీయ సంచాలకులు సంబిత్ పాత్రో తదితరులు అభినందనలు తెలిపారు.